



కార్తిక పూజలు

యడ్లపాడు: మండలంలోని సొలసలో భూసమేత రంగనాయస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక పూజలు వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 586.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,443 క్యూసెక్కులు వదిలారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7226 , హై లెవల్ కాలువకు 306 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన



తాళ్ళాయపాలెం (తాడికొండ): ఈ నెల 7వ తేదీన తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో చర్చించి పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ... తాళ్ళాయపాలెంలో 7వ తేదీన సీఎం చేతుల మీదుగా 400/200 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం కానుందని తెలిపారు. అనంతరం ఇతర జిల్లాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు చేయనున్నారని చెప్పారు. ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం ప్రారంభించనున్న సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పది పరీక్ష ఫీజు చెల్లింపునకు 18 వరకు అవకాశం

యడ్లపాడు: పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపునకు ప్రభుత్వం గడువు పెంచింది. ఈనెల 18వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అపరాధ రుసుంతో వచ్చే నెల వరకు చెల్లించుకోవచ్చని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ తెలిపారు. ఈనెల 19 నుంచి 25వ తేదీలోగా రూ.50 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చు. 26 నుంచి వచ్చే నెల మూడో తేదీలోగా రూ.200 అపరాధ రుసుంతో, వచ్చే నెల నాలుగు నుంచి 10వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

అర్హులందరికీ సిలిండర్లు



తెనాలి రూరల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీ, బాలాజీరావుపేట ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన దీపం-2 పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సిలిండర్లను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు ఆయన వెంట ఉన్నారు. బాలాజీరావుపేట అయ్యప్ప స్వామి గుడి సమీపంలో పంపిణీ సందర్భంగా ఆయన గ్యాస్ పొయ్యిని వెలిగించగా.. లబ్ధిదారు మల్లవరపు శివమ్మ టీ కాచి మంత్రి, జిల్లా కలెక్టర్ సహా అధికారులకు అందజేశారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్‌వో కోమలి పద్మ, సీఎస్‌డీటీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారానికి పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపిక



నగరంపాలెం: అజో విభో కందాళం ఫౌండేషన్ ప్రతి సంవత్సరం రచయితకు విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. వచ్చే ఏడాది 2025కిగాను అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను పురస్కారానికి ఎంపిక చేసినట్లు అరసం ఏపీ ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 3, 4, 5వ తేదీల్లో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరగబోయే సభలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబులకు జైలుశిక్ష

నగరంపాలెం: మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన ఇద్దరికి ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లత మంగళవారం తీర్పు చెప్పారు. పశ్చిమ ట్రాఫిక్ పీఎస్ సీఐ సీహెచ్ సింగయ్య ఈ మేరకు వివరాలు వెల్లడించారు.

ధృతరాష్ట్ర ప్రభుత్వం

సహానా కేసులో కనీసం స్పందించని కూటమి సర్కారు

- నామమాత్రంగానైనా అటు చూడని కూటమి పార్టీల నాయకులు
- బాధితులకు మాటలతోనైనా సాంత్వన చేకూర్చని హోం మంత్రి
- రమ్య కేసులో నాడు తక్షణమే స్పందించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- 7 రోజుల్లోనే చార్జిషీట్, 257 రోజుల్లో నిందితుడికి శిక్ష

'మగ'పుటేనుగుల కాళ్ల కింద మగువ నలిగిపోతోంది. కామాంధుల చేతిలో చిక్కిశల్యమవుతోంది. కుటిలనీతి పాలనలో కన్నీరుపెడుతోంది. చెవులుండీ వినలేని, కళ్లుండీ చూడలేని ధృతరాష్ట్ర రాజ్యంలో.. చేష్టలుడిగిన దుష్ట పాలకుల దుర్నీతికి బలవుతోంది. ఈ రాక్షస పాలన ఇక వద్దని ఆర్తనాదం చేస్తోంది. సాయం చేయాల్సిన కూటమి సర్కారు నిర్దయగా వ్యవహరించడంతో అండగా నిలిచే అసలైన నాయకుల 'దిశ'గా మహిళ కనులెత్తి దీనంగా చూస్తోంది. అధికారంలో ఉన్నా.. విపక్షంలో ఉన్నా.. బాధితుల పక్షాన వైఎస్సార్ సీపీ నిలిచింది.



సహానా కుటుంబానికి వైఎస్సార్ సీపీ తరఫున రూ.10 లక్షల చెక్ అందిస్తున్న అంబటి రాంబాబు, అన్నాబత్తుని (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో రోజు రోజుకు మహిళలపై దాడులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం ప్రజలను కలవర పెడుతోంది. ఏదైనా ఘటన జరిగినా మహిళ హోంమంత్రిగా ఉండి కూడా బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడం కానీ, వచ్చి పరామర్శించడం కానీ కనిపించని పరిస్థితి నెలకొంది. కొన్ని రోజుల క్రితం గుంటూరు జిల్లా తెనాలిలో సహానా అనే యువతిని తెలుగుదేశం పార్టీకి చెందిన రౌడీషీటర్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడైన నవీన్ కారు ఎక్కించుకుని తీసుకెళ్లాడు. గంటన్నర తర్వాత సహానా తల్లిదండ్రులకు ఫోన్ చేసి 'మీ కూతురుకు ఒంట్లో బాగోలేదు. కళ్లు తిరిగిపడిపోయింది. ఆసుపత్రిలో చేర్చాను... వెంటనే రండి' అంటూ చెప్పాడు. దీంతో యువతి తల్లిదండ్రులు పరుగులు తీసుకుంటూ ఆస్పత్రికి వచ్చారు. అప్పటికే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. తల్లిదండ్రులను చూసిన రౌడీషీటర్ నవీన్‌తోపాటు అతని ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి జారుకున్నారు. సహానాకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు బ్రెయిన్ డెడ్ అని తేల్చిచెప్పారు. కుమార్తెను బతికించుకోవడానికి ఆమెను అంబులెన్స్‌లో ఎక్కించుకుని తెనాలి నుంచి బయలుదేరి మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు వరకు వెళ్లారు. తర్వాత మళ్లీ తెనాలి, మళ్లీ గుంటూరు.. ఇలా హాస్పిటళ్లకు తల్లిదండ్రులు తిరిగారు. చివరకు అందరూ చేతులెత్తెయ్యడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. జీజీహెచ్‌లో వైద్యులు అన్ని టెస్టులూ చేసి బ్రెయిన్ డెడ్ అని, మీరు ఇంటికి తీసుకెళ్లవచ్చని తల్లిదండ్రులకు సూచించారు. కానీ వారు తమ కుమార్తెను ఎలాగైనా బతికించాలని వైద్యులను వేడుకున్నారు. తల్లిదండ్రుల ఆవేదనను చూసిన డాక్టర్లు చలించిపోయారు. వెంటిలేటర్‌పై సహానాను ఉంచి చికిత్స అందించడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులకు రౌడీషీటర్ నవీన్ దొరికిపోయాడు. మూడు రోజులపాటు వెంటిలేటర్‌పైనే ఉన్న సహానా ఆ తర్వాత మృతి చెందింది.

వైఎస్ జగన్ ప్రకటనతో చలనం

అంతకు ముందు రోజే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ కుటుంబానికి అండగా ఉంటానని ప్రకటించారు. గుంటూరు జీజీహెచ్‌కు వచ్చి పరామర్శిస్తానని తెలిపారు. కానీ అదే రోజు రాత్రి సహానా మృతి చెందింది. అప్పటి వరకు ప్రభుత్వం, పోలీసు శాఖ ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. జగన్ గుంటూరు వస్తానని చెప్పిన వెంటనే హడావుడిగా టీడీపీ నేతలు జీజీహెచ్‌కు వచ్చి ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోయారు. సహానాపై దాడి చేసిన రౌడీషీటర్ నవీన్‌ను మూడు రోజులపాటు తమ అదుపులోనే పోలీసులు ఉంచుకున్నారు. జగన్ వస్తారన్న ప్రకటనతో హడావుడిగా అరెస్ట్ చూపించారు. అప్పటికే ఘటన జరిగి నాలుగు రోజులైంది. వైఎస్ జగన్ ప్రకటనతోనే అందరిలో చలనం వచ్చింది.

సాయం ప్రకటించాకే కదిలిన నాదెండ్ల

సహానా మృతి చెందిన మరుసటి రోజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జీజీహెచ్‌కు చేరుకుని ఆమె కుటుంబాన్ని ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సహానా కుటుంబానికి రూ.పది లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ రోజు రాత్రి హడావుడిగా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ కుటుంబానికి రూ.పది లక్షల చెక్కును ప్రభుత్వం తరఫున అందచేశారు. ఆ తర్వాత ఆ కేసు గురించి మర్చిపోయారు. సహానా తల్లిదండ్రులు ఈ కేసులో నవీన్‌తోపాటు మరో ఇద్దరు నిందితులు ఉన్నారని చెబుతున్నా వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన పాపాన కూడా పోలేదు.

స్పందించని హోంమంత్రి అనిత, మంత్రులు మనోహర్, లోకేష్

సహానా తెనాలికి చెందిన యువతి. తెనాలి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ కానీ, పక్క నియోజకవర్గానికి చెందిన మరో మంత్రి నారా లోకేష్ కానీ సహానాపై జరిగిన దాడిపై కనీసం స్పందించలేదు. ఎప్పుడూ మీడియాలో హడావుడి చేసే హోంమంత్రి అనిత తప్పించుకుని తిరిగారు. నిత్యం మీడియా అటెన్షన్ కోరుకునే కేంద్ర మంత్రి పెమ్మసాని కూడా ఈ ఘటనపై నోరు తెరవలేదు. పైగా దాడికి పాల్పడిన రౌడీషీటర్ నవీన్ తన అనుచరుడు కావడంతో మీడియాకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం గుంటూరు జిల్లాలోనే ఉన్నా కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ దారుణంపై స్పందించిన పాపాన పోలేదు.

నాడు రమ్య కేసులో స్పందన భేష్

గతంలో ఇలాంటి ఘటనే గుంటూరులో జరిగింది. బీటెక్ స్టూడెంట్ రమ్యను 2021 ఆగస్టు 15న పరమాయకుంటలో వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకు చెందిన శశికృష్ణ నడిరోడ్డుపైనే హత్య చేశాడు. వెంటనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. డీజీపీతో మాట్లాడారు. పది గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. 48 గంటల్లోనే ఫోరెన్సిక్ రిపోర్ట్ తెప్పించారు. వారంలోనే చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రత్యేక పీపీని ప్రభుత్వం నియమించింది. 257 రోజుల్లోనే న్యాయస్థానంలో విచారణ పూర్తయింది. చివరకు శశికృష్ణకు కోర్టు ఉరిశిక్ష విధించింది. దీనిపై రమ్య కుటుంబ సభ్యులు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హత్య జరిగిన వెంటనే అప్పటి హోంమంత్రి మేకతోటి సుచరితతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు రమ్య ఇంటికెళ్లి భరోసా కల్పించారు. రమ్య కుటుంబ సభ్యులను అప్పటి సీఎం జగన్ వద్దకు తీసుకెళ్లారు. రమ్య హత్య జరిగిన మరుసటిరోజే కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు సీఎం. మరుసటిరోజే ఆ చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ప్రభుత్వం ఇంటిస్థలం కేటాయించింది. చార్జిషీట్ వేసిన వెంటనే దళిత వర్గానికి చెందిన రమ్య కుటుంబానికి రూ.8.25 లక్షల ఆర్థికసాయం అందించింది. ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు కేటాయించింది. నెలలోనే రమ్య సోదరికి రెవెన్యూ విభాగంలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది. డిగ్రీ పూర్తికి ఐదేళ్ల అవకాశం ఇచ్చింది. ఎలవర్రులో రూ.1.60 కోట్ల విలువైన ఐదెకరాల వ్యవసాయ భూమిని తల్లి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద రావాల్సిన నిధులను అందించింది. తమ కూతురు హత్యకు గురైతే సొంత కుటుంబసభ్యుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడ్డారని రమ్య తల్లి చెబుతోంది.



రమ్య కుటుంబానికి చెక్ అందిస్తున్న నాటి హోం మంత్రి సుచరిత (ఫైల్)

2018లో పోస్టు పెడితే ఇప్పుడు అరెస్టా?

- వైఎస్సార్ సీపీ క్యాడర్‌ను భయపెట్టడానికే కేసులు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరాచకాలు
- ఆ క్రమంలోనే వల్లభాపురం రైతు ఆళ్ల జగదీష్‌రెడ్డి అరెస్టు
- అది చాలదన్నట్టు తెనాలిలోనూ మరో కేసు దారుణం
- జగదీష్‌రెడ్డికి అండగా నిలిచి న్యాయపోరాటం చేస్తాం
- తెనాలి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్



ఆళ్ల జగదీష్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సోషల్ మీడియాలో పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌లను 2018లో విమర్శిస్తూ పెట్టిన పోస్టును షేరింగ్ చేసిన కారణంతో వల్లభాపురానికి చెందిన రైతు ఆళ్ల జగదీష్‌రెడ్డిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేయటం దారుణమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. దాంతోపాటు తెనాలి పోలీసులు మరో కేసును నమోదు చేయడం తగదని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తెలియకుండా ఇదంతా జరుగుతుందా అని ప్రశ్నించారు. జగదీష్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని, కేసులపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కొల్లిపర మండల మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన ఆళ్ల జగదీష్‌రెడ్డిని విజయవాడ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. పోలీసులు విడుదల చేయటంతో ఇంటికొచ్చిన జగదీష్ రెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సోషల్‌మీడియా కార్యకర్తలపై కేసులతో భయభ్రాంతుల్ని చేయటాన్ని పెద్ద ఎత్తున ఇలా చేస్తున్నారని గుర్తుచేశారు. ఆ క్రమంలోనే జగదీష్‌రెడ్డిని తెల్లవారుజామున ఇంటికొచ్చి మరీ తీసుకెళ్లినట్టు చెప్పారు. ఎవరు తీసుకెళ్లిందీ తెలీక, ఆ కుటుంబంతోపాటు గ్రామస్తులంతా ఆందోళన చెందారని తెలిపారు. తీరా చూస్తే సైబర్‌క్రైం పోలీసులని తెలిసిందన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు... ఈ రోజు అధికారం వచ్చిందనే గర్వంతో తమ పార్టీ కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా నియోజకవర్గంలో ఏనాడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదన్నారు. 'మీరు చూపిస్తున్న కొత్తమార్గాన్ని భవిష్యత్‌లో మేమూ అనుసరిస్తాం' అంటూ కూటమి నేతలను శివకుమార్ హెచ్చరించారు. వైఎస్సార్ సీపీని, క్యాడర్‌ను బెదిరించే ధోరణులను మానుకోవాలని, నాదెండ్ల మనోహర్ ఇప్పటికైనా దీనిపై ఆలోచన చేయాలని కోరారు. పార్టీ కొల్లిపర మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి మాట్లాడుతూ.. జగదీష్‌రెడ్డిని ఎవరో తీసుకెళ్లారని తెలిసిన దగ్గర్నుంచి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మనోధైర్యం కల్పిస్తూ వచ్చారని చెప్పారు. పార్టీ క్యాడర్‌కు ఏ చిన్న ఆపద వచ్చినా పార్టీ యంత్రాంగం, లీగల్‌సెల్ సహకరిస్తుందని పేర్కొంటూ ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ధైర్యంగా ఉంటూ రాబోయే ఎన్నికల్లో కూటమికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

గ్రామీణ ఆర్థిక ప్రగతికి ప్రణాళికలు కీలకం

జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు



మాట్లాడుతున్న జ్యోతిబసు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణాభివృద్ధికి ఆర్థిక పరిపుష్టి, స్వయం పరిపాలనకు దోహదం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ రాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ, రాష్ట్రీయ స్వరాజ్ అభియాన్, డీపీఆర్సీ ఆధ్వర్యంలో 2025-26 పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జిల్లాస్థాయిలో శిక్షణ నిర్వహించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా ఈ నెల 8వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మంగళవారం పల్నాడు జిల్లా పరిధిలోని 28 మండలాల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ప్రారంభించి సీఈవో మాట్లాడుతూ... శిక్షణ పొందిన బృందం మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తుందని వివరించారు. గ్రామాల ప్రగతి, ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధికి వీలుగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుందని అన్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలను కూడా ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ జేడీ ఆర్. కేశవరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ ప్రణాళికలు ఎంతో ముఖ్యమని చెప్పారు. డీపీవోలు కె. నాగసాయికుమార్, ఎంవీ భాస్కర రెడ్డి, డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త ఎస్. పద్మారాణి, రీసోర్స్ పర్సన్లు ఎస్. నిరంజన్‌రావు, షేక్ కరీముద్దీన్, కె. అనూరాధ, జిల్లా కన్సల్టెంట్ కె. జోసఫ్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కె. నాగేశ్వరరావు, డి. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



గుంటూరు నగరంలో మంగళవారం నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పలువురు భక్తులు శ్యామలానగర్‌లో నాగుల పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

అల్లాడుతున్న ఆలపాటి

- తెలుగు తమ్ముళ్ల సహాయ నిరాకరణ
- దాటవేత ధోరణిలో సీనియర్లు
- పట్టించుకోని జనసేన నేతలు
- ఓటు నమోదుకు నేడు చివరి తేదీ
- పీడీఎఫ్ నుంచి మళ్లీ లక్ష్మణరావు పోటీ
- టెన్షన్‌లో ఆలపాటి వర్గీయులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలో ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు అసమ్మతి సెగ తగులుతోంది. తెలుగు తమ్ముళ్లు సహాయ నిరాకరణ చేస్తున్నారు. పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించే అంశంలో చాలా మంది ఆలపాటి రాజాకు సహకరించడం లేదు. మరికొందరు మొక్కుబడిగా కానిచ్చేస్తున్నారు. ఆయన తన సొంత మనుషులు, తన ఎన్‌ఆర్‌ఐ విద్యాసంస్థల ఉద్యోగులు, విద్యార్థులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనియర్లు కూడా ఆలపాటిని వ్యతిరేకిస్తున్నారు.

మరో అధికార కేంద్రం అవుతారని...

ఆలపాటి రాజా గుంటూరు నగరంలోని లక్ష్మీపురంలో కార్యాలయం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులు, తన సామాజికవర్గానికి చెందిన నేతలతో రోజూ సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వారికి ఏ పనులు కావాలన్నా తానే చేయిస్తానని చెబుతున్నారు. పెదబాబు, చినబాబులలో ఎవరి వద్దనైనా పనులు చేయిస్తానని పేర్కొంటున్నారు. దీంతో నగరంలో మరో అధికార కేంద్రంగా తన కార్యాలయాన్ని మారుస్తుండటంతో గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారు. పశ్చిమలో ఓటర్లను చేర్పించే ప్రక్రియ కాస్త జరిగినా, తూర్పులో అనుకున్నంతగా లేదని సమాచారం.

చాలామంది అదే దారిలో...

ప్రత్తిపాడులో ఒక మీటింగ్ పెట్టి సరిపెట్టారు. పొన్నూరులో అయితే రాజాకు అసలు సహకారం అందలేదని సమాచారం. గతంలో సంగం డైరీ డైరెక్టర్ల విషయంలో ధూళిపాళ్ల నరేంద్ర, ఆలపాటి రాజా మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నరేంద్ర సహకరించడం లేదని తెలుగు తమ్ముళ్లే చెవులు కొరుక్కుంటున్నారు. తన సొంత నియోజకవర్గమైన తెనాలిలో కూడా సొంతంగా ఓటర్లను చేర్పించే ప్రక్రియను తమ సిబ్బందితో చేయిస్తున్నారు. ఫ్లెక్సీలలో నాదెండ్ల మనోహర్ ఫొటో పెట్టినా ఆయన నుంచి సహకారం శూన్యమని చెబుతున్నారు. గత సాధారణ ఎన్నికల సమయంలో మనోహర్‌కు ఆలపాటి రాజా సహకరించలేదన్న భావన బలంగా ఉండటంతో మంత్రి అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పల్నాడులో కూడా యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు తదితరులు కూడా మొక్కుబడిగా కార్యక్రమాలు చేస్తున్నారు.

గట్టి పోటీదారుతో టెన్షన్ మొదలు

మరోవైపు పోటీలోకి దిగుతున్నట్లు ప్రస్తుత ఎమ్మెల్సీ, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ప్రకటించారు. దీంతో తమ సామాజిక ఓట్లు చీలిపోతాయనే భయం తెలుగుదేశం పార్టీలో వ్యక్తం అవుతోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తూ అందరికీ అందుబాటులో ఉండే లక్ష్మణరావు మరోసారి బరిలోకి దిగడం వల్ల తమకు ఇబ్బంది అవుతుందన్న భావన ఆ పార్టీలో ఉంది. పార్టీ అధినేత జోక్యం చేసుకుని అందరితో మాట్లాడితే కొద్దో గొప్పో పరువు నిలుస్తుందని, గెలుపు మాత్రం అంత ఈజీ కాదన్న భావన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలలో ఉంది.

క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి 9వ తేదీ వరకు కుచ్ బెహర్ అండర్ –14 క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాచ్‌లను ఉదయం 8.30 గంటలకు ఏసీఏ ప్రెసిడెంట్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు..

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నెహ్రూనగర్: ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ - 2024 పరీక్షలకు టెట్ క్వాలిఫై అయిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.మయూరి మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 200 మంది అభ్యర్థులకు 2 నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ కూడా ఇస్తామని పేర్కొన్నారు. టీటీసీలో వచ్చిన మార్కుల ప్రతిపాదికన ఎంపిక ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి, టీటీసీ లేదా బీఎడ్ మార్కుల లిస్టు, టెట్ మార్కులు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్సు కాపీలు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 10వ తేదీలోగా రాజాగారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్ గుంటూరు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏఎంరెడ్డి కళాశాలలో వాలీబాల్ పోటీలు

నరసరావుపేటరూరల్: పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి ఏడు కళాశాలల జట్లు పోటీలో పాల్గొన్నాయి. పోటీలను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన పోటీలలో ఇండో అమెరికన్ ఫార్మసీ కళాశాల(జొన్నలగడ్డ) విన్నర్‌గా, విక్టోరియా కళాశాల(పేరేచర్ల) జట్లు రన్నర్‌గా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతి, ట్రోఫీలు అందజేశారు. శాంతి మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. ప్రతి ఏడాది ఇటువంటి క్రీడా పోటీలను కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు వివరించారు.

‘మైక్రో’ రికవరీ ఏజెంట్ల బరితెగింపు

- ప్రత్తిపాడులో మళ్లీ మహిళలకు రోజంతా వేధింపులు
- గతంలో అధికారులు హెచ్చరించినా ఆగని ఆగడాలు
- ఉదయం నుంచి రాత్రి వరకు ఇళ్ల ముందే తిష్ట
- ఇబ్బందులు భరించలేక బయటకు వెళ్లిపోయిన బాధితులు



తలుపులు వేసి ఉన్న ఇంటి ముందు కూర్చున్న మైక్రో ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో మైక్రో ఫైనాన్స్ కంపెనీల వేధింపులు ఆగడం లేదు. కొద్ది రోజుల కిందట వడ్డెర కాలనీకి చెందిన మహిళలను ఓ మైక్రో ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు ఈఎంఐలు కడతారా.. పురుగు మందు తాగి చస్తారా.. అంటూ వేధింపులకు గురిచేసిన ఘటన మరువక ముందే, మరో ఘటన మహబూబ్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు..... గుంటూరుకు చెందిన మైక్రో క్రెడిట్ అనే మైక్రో ఫైనాన్స్ కంపెనీ ప్రత్తిపాడులో ఏడు గ్రూపులకు చెందిన 74 మందికి ఒక్కొక్కరికి రూ. 40 వేల చొప్పున రుణాలిచ్చింది. వారు నెలకు రూ. 2 వేల చొప్పున ఈఎంఐ చెల్లించాలి. రుణాలు తీసుకున్న వారిలో 24 మంది మహబూబ్‌నగర్ కాలనీ వాసులు ఉన్నారు. ఈఎంఐ సకాలంలో చెల్లించడం లేదు. దీంతో మంగళవారం ఉదయం కంపెనీకి చెందిన రికవరీ ఏజెంటుతోపాటు డివిజనల్ హెడ్ జి. సుబ్బారావులు ప్రత్తిపాడుకు వచ్చారు. ఈఎంఐలు చెల్లించాల్సిందేనని బెదిరించారు. చెల్లించే వరకు ఇక్కడి నుంచి కదలబోమని ఉదయం 8 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఇళ్ల ముందే తిష్ట వేసుకుని కూర్చున్నారు. ప్రస్తుతం కూలీ పనులు కూడా ఆశించిన స్థాయిలో లేవని, కుటుంబాలకు పూట గడవడమే కష్టంగా ఉందని, మరికొంత సమయం ఇస్తే ఈఎంఐలు చెల్లిస్తామని మహిళలు విన్నవించారు. అయినా రికవరీ ఏజెంట్లు వినలేదు. ఈఎంఐలు చెల్లించే వరకు ఇక్కడే ఉంటామని ఇళ్ల ముందే బైఠాయించారు. దీంతో ఏం చేయాలో పాలుపోని మహిళలు ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు.

బలవంతపు వసూళ్లకు వీల్లేదు: ఏపీఎం

ఈ విషయం వెలుగు ఏపీఎం వి. లాజరు దృష్టికి వెళ్లడంతో ఆయన మైక్రో కంపెనీ రికవరీ ఏజెంట్లతో ఫోన్‌లో మాట్లాడారు. మహిళలను వేధింపులకు గురిచేస్తే ఉపేక్షించబోమని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి డీఆర్‌డీఏ అనుమతులు ఉన్నాయా? లేవా? ఉంటే ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఉన్నాయి? అనే వివరాలను తమకు అందించాలని పేర్కొన్నారు.

పొద్దున్నుంచి ఇంటి ముందే కూర్చున్నారు



కుటుంబం గడవక మా కోడలు రుణం తీసుకుంది. పనుల్లేక సకాలంలో ఈఎంఐలు కట్టలేకపోయాం. పొద్దున తొమ్మిది గంటలకు వచ్చారు. డబ్బు కడితేనే ఇక్కడి నుంచి వెళతామంటూ ఇంటి ముందు కూర్చున్నారు. చేసేదేమీ లేక ఇళ్లకు తలుపులు వేసి మా కొడుకు, కోడలు వెళ్లిపోయారు. – పి. సాలమ్మ

అంతర్ జిల్లా స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



బటర్ ఫ్లై విభాగంలో తలపడుతున్న దృశ్యం

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు మంగళవారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్ ప్రారంభమయ్యాయి. పోటీలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, పోటీల పరిశీలకుడు బంగార్రాజు (తూర్పుగోదావరి), స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్ ప్రారంభించారు. పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 650 మంది క్రీడాకారులు, దాదాపు 125 మంది టీమ్ మేనేజర్లు, సిబ్బంది హాజరయ్యారు. ఆయా జిల్లాల క్రీడాకారులు ఫ్రీస్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్ తదితర విభాగాలలో పోటీ పడనున్నారు. అంతర్ జిల్లాల పోటీలతో పాటు ఆయా విభాగాలలో జాతీయస్థాయి పోటీలలో పాల్గొనున్న రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్టు స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగా శివ శంకర్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షులు డి.ఆనంద్ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా ఇ.శివ శంకర్ కార్యదర్శిగా వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎం.రమేష్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, ఎ.శివ కిషోర్, పి.చంద్రశేఖరరెడ్డి, పి.అనసూర్య, కోశాధికారిగా కె.లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా పి.భాను ప్రకాష్, జి.శ్రీనివాసరావు, బి.జొన్న నాయక్, ఎస్.నాగరాజు, ఎం.వెంకటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి నూతన కార్యవర్గం మరింత కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతర పంటలతో అధిక లాభాలు



పంటలను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, సభ్యులు

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని న్యూ చిట్యాల, నాగిరెడ్డిపాలెం గ్రామాలలో కంది, మిర్చి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రన్‌తో కలసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ కందిలో అంతర పంటలుగా గోరు చిక్కుడు, సజ్జ, దోస, అలసంద, పెసర పంటలు, రక్షక పంటగా జొన్న వేయడం జరిగిందన్నారు. ఈ విధానం వలన కంది పంటను ఆశించే పురుగు తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. అంతర పంటల ద్వారా ఇప్పటివరకు రూ.3వేలు ఆదాయం వచ్చిందని రైతులు తెలిపారు. భూమి పంటలతో కప్పించడం ద్వారా కలుపు నివారణ సాధ్యమవుతుందని, అన్ని రకాల పంటలు వేయడంతో భూమి సారవంతమవుతుందని తెలిపారు. కంది పంట వేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా నికర ఆదాయం పెరుగుతుందని అంతర పంటల ద్వారా ప్రధాన పంటకు అయ్యే ఖర్చు తగ్గించవచ్చని అన్నారు. మిర్చిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటలుగా ముల్లంగి, బంతి, కొత్తిమీర వేయడం ద్వారా ప్రధానంగా ఈ పంటల నుండి వచ్చే ఘాటైన వాసనకు మిరపలో వచ్చే తామర పురుగు ఉధృతి తగ్గుతుందని, రైతుకి అదనపు ఆదాయం చేయకూరుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య, సిబ్బంది సైదయ్య, నందకుమార్, అనంతలక్ష్మి, అంజలి, నరసింహారావు, మాధవి, రైతులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా ఆనందరావు



పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన న్యాయవాది తాడిశెట్టి వెంకట ఆనందరావు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైకోర్టు సెక్షన్ అధికారి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గుంటూరులో ఆయన న్యాయవిద్య అభ్యసించి, ప్రాక్టీస్ నిర్వహించారు. ఆయన నియామకం పట్ల పొన్నూరు న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఆధ్వర్యంలో డీఎస్సీ-2024 ఎస్‌జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి బి.శివనాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 11వ తేదీలోగా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 200 మంది అభ్యర్థులకు 2నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందిస్తామని వివరించారు. ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను టీటీసీ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి, టీటీసీ, టెట్ మార్కుల లిస్టులు, కుల, ఆదాయ (రూ.ఒక లక్ష లోపు), ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, రెండు ఫొటోలు జత పరచాలన్నారు.

జీబీసీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ముప్పాళ్ల: మండలంలోని గుంటూరు బ్రాంచి కాలువలోని లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహం మంగళవారం గుర్తించారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు పైబడి ఉంటాయని, కాల్వలో పడి సుమారు నాలుగు రోజుల పైబడి ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా ఉబ్బి కుళ్లి పోయి ఉంది. బోర్లా ఉండటంతో గుర్తుపట్టడానికి వీలు లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి జేసీబీతో మృతదేహాన్ని బయటకు తీశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల నుంచి వైద్యుడిని పిలిపించి అక్కడే శవపంచనామా నిర్వహించి, సమీపంలోనే పూడ్చి వేశారు. నాలుగు రోజుల కిందట వృద్ధులు ఎవరైనా కనిపించకుండా పోయిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, మృతదేహం పై ఎలాంటి దుస్తులు లేవని, కుడి చేతికి మాత్రం రాగి కడియం ఉందని ఎస్సై యు.సోమేశ్వరరావు తెలిపారు.

పోలీసులతో కలిసి టీడీపీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారు

డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: టీడీపీ నాయకులు పోలీసులతో కలసి తమను హతమార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి శ్రీనివాసరావు, మోర్ల కోటేశ్వరరావులు మంగళవారం తాడేపల్లిలోని డీజీపీ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, ఎస్ఐ శివయ్యతో సోమవారం రాత్రి సుదీర్ఘ మంతనాలు జరిపినట్లు బాధితులు ఆరోపించారు. అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పోలీస్ అధికారులు, టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయి బాబా నుంచి తమకు తగు రక్షణ కల్పించాలని బాధితులు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఐలవరం(భట్టిప్రోలు): నెల్లూరు జిల్లా దర్గామిట్టా బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఏ యోగా పోటీలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుచున్న కె.సంపత్ సత్తా చాటాడు. తద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

టోల్ గేట్ వద్ద ఇద్దరు బాలల గుర్తింపు

వివరాలు తెలిస్తే సంప్రదించాలని పోలీసుల సూచన



రూరల్ ఎస్ఐ వెంకట్‌తో చిన్నారులు

మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద ఒంటరిగా తిరుగుతున్న ఇద్దరు పిల్లలను రూరల్ పోలీసులు స్టేషనుకు తరలించారు. ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాలు మేరకు .. మంగళవారం టోల్‌గేట్ వద్ద ఒంటరిగా తిరుగుతున్న ఇద్దరు పిల్లలను గమనించిన స్థానికులు తమకు సమాచారమిచ్చారన్నారు. బాలిక (10) పేరు షేక్ ఆఫియా అని, బాలుడు (7) పేరు షేక్ సలీం అని దర్యాప్తులో తేలింది. వారి తల్లిదండ్రులు షేక్ సలీం, జయ అని బాలలు చెబుతున్నారు. విజయవాడ చిట్టినగర్, గుంటూరు అని వేర్వేరుగా చెబుతుండడంతో స్టేషన్‌కు తరలించారు. వారి వివరాలు తెలిసిన వారుగానీ, తల్లిదండ్రులుగానీ సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

అపార్ నమోదులో సమస్యలు పరిష్కరించాలి

డీఈవో రేణుకకు అప్సా విజ్ఞప్తి



డీఈవో రేణుకకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవీంద్రబాబు, శ్రీహరి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అపార్ నమోదులో సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (అప్సా) రాష్ట్ర కో-కన్వీనర్ మేకల రవీంద్రబాబు, కోశాధికారి చెరుకూరి శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుకను అప్సా ప్రతినిధులు కలిశారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అప్సా ప్రతినిధులు మాట్లాడుతూ.. అపార్ కోసం విద్యార్థుల వివరాల నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యూడైజ్ ప్లస్, ఆధార్‌లోని వివరాలు సరిపోలకపోవడంతో నమోదు కావడం లేదని పేర్కొన్నారు. ఆధార్‌లో తప్పుల సవరణకు విద్యార్థులు ఆయా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని డీఈవోకు వివరించారు. అపార్ అప్‌లోడింగ్‌కు గడువు పెంచాలని కోరారు. పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఆదివారాల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఈవో రేణుక స్పందిస్తూ.. ఆధార్ సవరణల కోసం గుంటూరు నగరంలో అదనపు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. డీఈవోను కలిసిన వారిలో అప్సా రాష్ట్ర నాయకులు వంగా శ్రీనివాసరావు, ఏవీ సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు మురళీమోహనరావు, డివిజన్ అధ్యక్షులు నర్రా రాజేష్, భాను ప్రసాద్, నాయకులు మాదా శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, పాశం శ్రీనివాసరావు ఉన్నారు.

మార్చి ఆఖరులోగా ఇళ్లు కట్టకపోతే బిల్లులు రావు



ప్రత్తిపాడులో ఇళ్లను పరిశీలిస్తున్న జేవీఎస్‌ఆర్‌కేవీ ప్రసాద్, ఈఈ శంకరరావు తదితరులు

ప్రత్తిపాడు: ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించిన లబ్ధిదారులు మార్చి నెలాఖరులోగా పూర్తి చేయకుంటే వాటికి సంబంధించి బిల్లులు రావని గృహనిర్మాణ శాఖ పీడీ జె.వి.ఎస్.ఆర్.కె.వి. ప్రసాద్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మంగళవారం పీడీ పర్యటించారు. స్థానిక హౌసింగ్ లే అవుట్‌లోని ఇళ్లను మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంతమందికి పట్టాలిచ్చారు, ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఏ దశల్లో ఎన్ని ఉన్నాయి..? వంటి వివరాలను హౌసింగ్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక పరిస్థితి సహకరించని వారికి వెలుగు ద్వారా అధిక రుణాలు మంజూరు చేయించాలని ఎంపీడీవో శివ పార్వతి, వెలుగు అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రోజుకో మండలంలో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు క్రయ, విక్రయాలు చెయ్యడానికి వీల్లేదని పీడీ స్పష్టం చేశారు. వెంట ఎంపీడీవో కె. శివపార్వతి, హౌసింగ్ ఈఈ ఎ. శంకరరావు, డీఈ సత్యనారాయణ, ఏఈ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఆచార్యుడి పరిశోధనకు పేటెంట్



ఆచార్య పీవీ కృష్ణకు పేటెంట్ పత్రాలను అందజేస్తున్న వీసీ తదితరులు

ఏఎన్‌యూ: గోదావరిలో లభించే పొలస చేపలలో ఉండే పోషక పదార్థాలపై చేసిన పరిశోధనకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ ఆచార్యుడు పీవీ కృష్ణకు పేటెంట్ లభించింది. ఈ మేరకు చెన్నైలోని భారత ప్రభుత్వ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పేటెంట్ కార్యాలయం నుంచి ఈ మేరకు ఆయనకు సమాచారం అందింది. వర్సిటీలో మంగళవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు నుంచి ఆ పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ పేటెంట్ రావడం గర్వకారణమన్నారు. ఆచార్య పీవీ కృష్ణ మాట్లాడుతూ.. పులస చేపలలో ప్రొటీన్లు, సాచ్యురేటెడ్, అన్‌సాచ్యురేటెడ్ ఆమ్లాలలో ముఖ్యమైన డోకోసహెక్సయినోయిక్ (డీహెచ్ఏ), ఐకోసపెంటయినోయిక్ (ఈపీఏ) మీద పరిశోధన చేశానన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జియాలజీ విభాగాధిపతి ఆచార్య పీజే రత్నాకర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు ఆయన్ను అభినందించారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ అండర్-14 బాలుర రాష్ట్ర జట్టు క్రీడాకారులు

- అండర్-14 విభాగంలో తూర్పు గోదావరికి ప్రథమ స్థానం
- అండర్-14 బాల బాలికల రాష్ట్ర జట్లు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్-14 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ స్థానం సాధించగా, కృష్ణా, విశాఖ జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ, అనంతపురం ద్వితీయ, కృష్ణా జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొనే అండర్-14 బాల బాలికల రాష్ట్ర జట్టును సోమవారం రాత్రి స్కూల్ గేమ్స్ పల్నాడుజిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. మూడురోజులుగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్ జిల్లాల అండర్-14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలలో భాగంగా రాష్ట్ర జట్లు ఎంపిక నిర్వహించారు.

అండర్-14 బాలుర విభాగంలో వి.సుశ్రిత్, ఎస్.శ్రీచరణ్, కె.త్రిశాల్ (తూర్పుగోదావరి), ఈ.కౌశిక్, ఎం.సంతోష్ (అనంతపురం), ఈ.చార్లెస్‌వెస్లీ (పశ్చిమగోదావరి), జి.జగదీష్, వి.కేతన్‌సాయి (కృష్ణా), కె.జైరామ్ (విశాఖ), పి.జీవన్ (కర్నూల్), కె.సాయిసంతోష్ (చిత్తూరు), కె.కార్తికేయ (నెల్లూరు).

అండర్-14 బాలికల విభాగంలో సిహెచ్.ఐశ్వర్యాంబిక, బిఎస్ఆర్ మాధురి, సిహెచ్.భువనేశ్వరీ (తూర్పుగోదావరి), బి.కుసుమ, ఆర్.వాహిని (కృష్ణా), జి.శాన్య, కె.అముక్త (విశాఖ), యోగశ్రీ (పశ్చిమగోదావరి), ఎస్.సాయిశ్రీ (గుంటూరు), రిషిత (చిత్తూరు), శ్రీజా (అనంతపురం), ఎన్.ముస్కన్ (కర్నూలు).

బకాయిలు లేకుండా వసూళ్లు చేయాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ పి.విజయ్‌కుమార్

పిడుగురాళ్ల: విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ బకాయిలు లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణ సమీపంలోని కొండమోడు విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ఎస్ఈ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సబ్ డివిజన్ పరిధిలోని రికార్డులు పరిశీలించారు. 33/12 కేవీ కొండమోడు సబ్‌స్టేషన్ పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలని, విద్యుత్ బకాయిలు లేకుండా వసూళ్లు చేయాలన్నారు. మొండి బకాయిలపై దృష్టి పెట్టి వసూళ్లు చేయించాలని సూచించారు. సోలార్ పీఎం సూర్య గర్‌పై సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మాచర్ల డివిజన్ మోడల్ ఆఫీసర్ సింగయ్య, సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.